# తప్పైవాహం

'తారక'



"నువ్వొచ్చిన కారణం ఇంతవరకూ చెప్పలేదు!"

కృష్ణమూర్తి తల దువ్వుకుంటున్న వాడల్లా ఆగి, మధుమూర్తి వేపు చూశాడు.

"చెప్పకూడనిదైతే చెప్పకు! కానీ ఒక్క విషయం మాత్రం గుర్తు పెట్టుకో! నువ్వెందుకీ పట్నం వచ్చావో తెలియదనుకోకు!"

"సరే! నువ్వే తెలుసుకో! నీవు ఓడిపోయావని ఒప్పుకున్నప్పుడు, నే చెబుతాను! ఏం?"

మధుమూర్తి ఒప్పుకున్నాడు, మౌనంగానే, ఆ పరీక్షకు!

"ఊఁ! వెడదాం, పద!"

"ఎక్కడికి?"

"అదీ తెలుసుకో!" నవ్వాడు కృష్ణమూర్తి.

"ఒరేయ్! నే తెలుసుకునేలోగా, నువ్వెళ్ళిపోయే రోజు దగ్గిరపడుతుంది!"

రోడ్డు మీదికి వచ్చాక, టాక్సీ పిలిచి, ఇద్దరూ కూర్చున్నారు

"ఎక్కడికి, సార్?" డ్రైవర్ ప్రశ్నించాడు.

"ఇప్పుడైనా చెప్పవా?" మధుమూర్తి అడిగాడు.

"పంజాగుట్ట!"

"పంజాగుట్టా! అక్కడ ఎవరింటికి?"

"మేజర్ భగవంతంగారింటికి!"

"భగవంతంగారింటికా?"

"ఊఁ!. . . ఆయన నీకు తెలుసా?"

మధుమూర్తి సమాధానం చెప్ప లేదు. 'కృష్ణమూర్తికి మేజర్‌గారింట్లో ఏం పనా?' అన్న ఆలోచనలో పడ్డాడు.

మేజర్ భగవంతంగారు సైన్యం నుంచి పదవీవిరమణ చేశాక, హైదరాబాదులో ఇల్లు కట్టుకుని, అక్కడే స్థిరపడ్డారు. కొడుకు సచివాలయంలో అసిస్టెంట్ సెక్రటరీ. పెళ్లి అయిన ఇద్దరు అమ్మాయిలు కాపరాలకు వెళ్లగా, మూడో అమ్మాయి పద్మజ కాలేజీలో బి. ఎస్‌సి. చదువుతూంది. అక్కడ కృష్ణమూర్తికేం పని?

"ఒరేయ్! ఆయన ఇల్లు తెలుసంటి విగా! ఎటు పోవాలో చెప్పు. . . టాక్సీ ఆగి ఐదు నిమిషాలైంది!" కృష్ణమూర్తి కుదిపినమీదట బాహ్యప్రపంచంలోకి వచ్చాడు మధుమూర్తి.

"ఆఁ! సరాసరి పోనిచ్చెయ్యి! ఆ చౌరస్తా పక్కగల్లీలోకి పోనియ్యి!"

టాక్సీ సరాసరి వెళ్లి, ఎర్రబంగళా ముందు ఆగింది.

కృష్ణమూర్తి టాక్సీకి డబ్బులిచ్చి పంపేశాడు. ఆ తరవాత గేటుమీద "కుక్కలున్నాయి జాగ్రత్త" అన్న బోర్డు చూసి, "ఒరేయ్! కుక్కలు కరుస్తా యేమోరా బాబూ!" అన్నాడు.

"నే ఉన్నాగా, ఫర్వాలేదు! రా!" మధుమూర్తి కృష్ణమూర్తి చెయ్యి పట్టుకు ముందుకు తీసుకువెళ్లాడు.

గేటులో ఉన్న గూర్ఖా, సలాం పెట్టాడు, గేటు తీసి.

"ఏరా! నీ కీ ఇంటితో బాగా పరిచయ మున్నట్టుందే!"

"ఏం?"

"గూర్ఖా సలాం ఎందుకు పెడతాడు లేకపోతే! పైగా ఇంట్లో ఉన్న కుక్కలకు కూడా నీతో బాగా పరిచయముండి ఉంటుంది!"

"ఒరేయ్! నణుక్కురా!"

పెద్ద అల్సేషియన్‌కుక్క వరండాలో షికార్లు తిరుగుతూ, క్షణం ఆగి, చూసింది. ఆ చూపుకు కృష్ణమూర్తి గుండె ఆగిపోయి, కాళ్లు తడబడ్డాయి.

"ఒరేయ్! అంత ఉందేంరా కుక్క! ఏం తింటుందేమిటి?"

"పిరికివాళ్ల గుండెకాయ! మాటాడకుండా నా వెంట రా! నీ వేమాత్రం భయపడ్డట్లు పసికట్టినా, మన అమరావతి జ్ఞాపకం వచ్చేలా చేస్తుంది!"

వరండాలో కుక్క, పురాణంసినిమాలో రాక్షసుడిలా, నాలిక చాపుకుని, ఆకలితో చూస్తూ, వచ్చే కృష్ణమూర్తిని వాసన చూసింది! ఒక్క గెంతు గెంతాడు కృష్ణమూర్తి! కుక్క ముందుకు వెళ్లేదే, మధుమూర్తి, "డాలీ! అందర్ ఛలో" అని ఆజ్ఞాపించకపోతే!

ఇద్దరూ హాల్లోకి వెళ్లి సోఫాల్లో కూర్చున్నారు.

"ఎవరితో పని?"

"భగవంతంగారితోనే." కృష్ణమూర్తి గొంతులో వణు కింకా పోలేదు.

"ఒరేయ్! ఆ కుక్క ఇక ఇక్కడకు రాదులే! భయపడక దర్జాగా కూర్చో! నే వెళ్లి, వారిని తీసుకువస్తాను! ఏం?" మధుమూర్తి లేచాడు.

కృష్ణమూర్తి మధుమూర్తి చెయ్యి పట్టుకుని, "నువ్వెందుకురా వెళ్లటం! పనిమనిషిచేత కబురంపుదూ!" అన్నాడు.

"ఇంత భయమైతే ఎలారా?" మధుమూర్తి చతికిలబడ్డాడు.

ఇంతలో భగవంతంగారే వచ్చారు. వస్తూనే, "రాఘవయ్య మూడోకొడుకువి నువ్వేగదూ?" అని కృష్ణమూర్తిని ప్రశ్నించారు.

"అవునండి." కృష్ణమూర్తి లేచి నమస్కారం చేశాడు.

"నీకు ఇతడు ఫ్రెండా?"

"అవునండి!"

"కాలేజీలోనా?"

"కాదండి! నా చదువుకు వాళ్ల నాన్నగారే కారకులు! మా ఇద్దర్నీ వారే చదివించారు!"

"అలాగా! కూర్చోండి." భగవంతం గారు తనూ ఓ సోఫాలో కూర్చుని, "ఒరే, ఆశయ్యా. . . ఇలా రా" అని కేకేసి, "నువ్వు రాత్రే ఇక్కడకు వస్తా వేమోనని ఎదురుచూశాం! ఇక్కడికే పంపమని మీ నాన్నకు ఉత్తరంలో వ్రాశాను!" అని అన్నారు.

"నే నుండగా, మరెక్కడికీ పోడండి!"

"అవునవును. అంతేగా!. . . ఆఁ చూడు, ఆశయ్యా, వీళ్లిద్దరకూ టిఫిన్, కాఫీలు తెమ్మను."

"మేం తినే బయలుదేరామండి!"

"తెలుసు! కానీ, మా రాఘవయ్య కొడుకు వచ్చాడుగా! వాడి కోసం ఈ మర్యాద! మధూ! రాఘవయ్యకూ, నాకూ నీకు, కృష్ణమూర్తికి ఉన్నంత స్నేహం ఉండేది. చిన్నప్పుడే నే సైన్యంలో చేర కుండా ఉంటే, ఈ కృష్ణమూర్తి మేనత్తను చేసుకొని ఉండేవాణ్ణి! ఆ రోజుల్లో బ్రాహ్మల్లో ఓ కుర్రాడు సైన్యంలో చేరి, నానా జాతి కూడు తినటమంటే ఇంట్లోకి రానిచ్చేవాళ్లు కారు. ఇక నాకు పిల్ల నెవ రిస్తారు! అందుకనే రిటైరయ్యాకకూడా, పుట్టిన స్వగ్రామాన్నీ, బంధువులనీ వదిలేసి, ఇక్కడే స్థిరపడ్డాను. ఇప్పుడా పట్టింపులనీ లేవనుకో!"

కాఫీ టిఫినులు ఆరగించటమయ్యాక "సిగరెట్ కాల్చుకోవోయ్! నా కలాంటి పట్టింపులేం లేవు" అని బలవంతాన కృష్ణమూర్తిచేత సిగరెట్ కాల్పించారు.

"రాండి, ఇల్లోసారి చూద్దురుగాని." భగవంతంగారు లేచారు. కృష్ణమూర్తి, మధుమూర్తి అనుసరించారు.

మధుమూర్తికి ఆ ఇల్లు కొత్తేం గాదు. ఇప్పుడు ప్రత్యేకించి, సవివరంగా చూడాలన్న ఉత్సుకత ఏం లేదు. కృష్ణమూర్తి భగవంతంగారింటికి ఎందు నిమిత్తమై వచ్చాడు? భగవంతంగారు, కృష్ణమూర్తి నెందు కింత ఆప్యాయంగా చూస్తూ, గృహాంతర్భాగాలు చూపు తున్నారు అన్న జిజ్ఞాస మధుమూర్తిని వీడలేదు.

ఒక్కొక్క గదే చూసుకుంటూ, పద్మజ గదిముందు ఆగారు ముగ్గురూ!

**తనను నిండు హృదయంతో ప్రేమించిన స్త్రీని పురుషుడు ఎన్నటికీ అర్థం చేసుకోలేడేమో! స్త్రీ ప్రేమకు ఆరాధన ఒక్కటే ఆలంబన. కాని పురుషుని ప్రేమకు డబ్బు, ఆస్తి, హోదా, అనే కానేక సాంఘిక, సామాజిక విలువలు ఆధారాలవుతాయి. కానీ, స్త్రీ పురుషుల ఆరాధన ఒకటే అయి, అది ప్రేమగా పరిణమించడం ఎక్కడో, ఎప్పుడోగానీ సాధ్యం కాదు!**

"అమ్మాయ్, పద్మా! లోపలకు రావచ్చా?" భగవంతంగారు బయటినుంచి కేకేశారు.

"రాండి, డాడీ!" పద్మజ లోపల నుంచే సమాధానం ఇచ్చింది.

సోఫాలో జారగిలబడి, కాళ్లు టీపాయ్ మీద చాచుకుని, పుస్తకం చదువుతున్న పద్మ, తండ్రివెంట లోపలకు వచ్చిన కృష్ణమూర్తిని, మధుమూర్తిని చూసి చటుక్కున లేచి నిలబడింది.

"ఆఁ చూడమ్మా! ఇతడు కృష్ణమూర్తి అని నాచిన్ననాటి స్నేహితుని కుమారుడు. ఎమ్. కామ్. చదివి, ఇంటి దగ్గరే ఉండి, వ్యవసాయం చూసు కుంటూ అమరావతిలో మెడికల్ షాప్ పెట్టి వ్యాపారంలోకూడా కాలు పెట్టాడు!. . . మా అమ్మాయి పద్మజ! బి. ఎస్‌సి. ఫైనలియర్!"

కృష్ణమూర్తి ప్రతినమస్కారం చేశాడు, పద్మజ నమస్కారానికి.

ఆ తరవాత ముగ్గురూ కింది హాల్లోకి వచ్చారు.

"మా శ్రీనివాస్ పొద్దున్నే పనుందని ఆఫీసుకు వెళ్లాడు. వాడి భార్య పుట్టింటికి వెళ్లింది! మధూ, సాయంత్రం ఓ సారి రాండి! వాడు ఇంట్లోనే ఉంటాడు! ఏం?"

"అలాగే! మరి వెళ్లివస్తామండి!"

"కృష్ణ ఇంకా రెండు రోజు లుంటాడా?"

"ఉంటాడండి! హైదరాబాదు ఇదేగా రావటం. ఊళ్లో విశేషాలన్నీ చూసిగానీ వెళ్లడు!"

"నువ్వున్నావుగా, రాకపోతాడా!" మధు చిన్నగా నవ్వాడు.

ఆ తరవాత ఆయన దగ్గిర సెలవు తీసుకుని మధుమూర్తి, కృష్ణమూర్తి వచ్చేశారు.

• • •

"మధూ! పద్మజ ఇంత అందంగా ఉంటుందని ఇక్కడికి వచ్చేముందు నే నూహించలేదురా!"

మధు కృష్ణమూర్తి మాటలకు నిరుత్తరుడయ్యాడు! క్షణం విచిత్రంగా చూశాడు కృష్ణమూర్తి నేపు!

"అంటే ఇక్కడకు పెళ్లిచూపులకే వచ్చావా?"

"అవును!"

"మరయితే ఆ సంగతి ఇంతవరకా ఎందుకు చెప్పలేదు?"

"ఇప్పుడు చెబుతున్నాగా!. . .

(తరువాయి 38 వ పేజీలో)

డాలి. వీలయితే, కృష్ణమూర్తి కూడ అక్కడే ఉంటాడు కనక అతనికీ ఈ అంతర్యం వివరించవచ్చు'అని భావించింది పద్మజ!

అనుకున్నదే తడవుగా బాత్‌రూమ్‌కి వెళ్లి మొహం చన్నీళ్లతో కడుక్కుంది. డ్రస్ మార్చుకుంది. హాండ్‌బాగ్ తీసుకుని కారులో మధుమూర్తి గదికి బయలు దేరింది.

'కృష్ణమూర్తితో ఇదే తొలిసారి మాట్లాడటం! చదువుకున్నవాడు, సంస్కారం ఉన్నవాడు, స్నేహానికి ప్రాణమిచ్చే మనిషి కనక, తనను అపార్థం చేసుకోడు' అని తర్కించుకుంది వెడుతూ!

అంతలో ఆమెకు మధుమూర్తితో ఏర్పడ్డ పరిచయపు స్మృతులు మదిలో మెదిలాయి!

తను కెమిస్ట్రీలో వీక్. కనక ట్యూషను చెప్పించాలని నాన్నగారు నిర్ణయిస్తే, తనూ ఒప్పుకుంది. 'ఎవరు చెబుతారు?' అన్న సమస్య ఎదురైంది. నాన్నగారికి తనను మాస్టారింటికి పంపటం ఇష్టం లేదు. పైగా, హైదరాబాదులాంటి విశాలనగరంలో ఒక రోజు మూల, మరొకరు మరొక చోట! రాత్రో, పొద్దుటో ట్యూషను చెప్పే వాళ్లు ఇంటికే వచ్చి చెప్పాలి! పెద్ద ప్రొఫెసర్లు ఇళ్లకు రారు. ఇళ్లకి వచ్చి చెప్పేవాళ్లు అంతగా హోదా, చదువులో ప్రజ్ఞ కల వాళ్లుండరు. ఆడప్రొఫెసర్లు తన ఇంటికి రావటానికి అంగీకరించలేదు, దూరమని!

ఎలా?

అన్నయ్య శ్రీనివాస్ సాయంత్రం ఓ రోజు మధుమూర్తిని తీసుకువచ్చి "పద్మా, వీరు మధుమూర్తిగారు. మా డిపార్ట్‌మెంట్‌లో కొత్తగా ఎల్. డి. సి.గా చేరారు. ఎమ్. ఎస్‌సి. కెమిస్ట్రీ ఆంధ్రా యూనివర్సిటీ! వీరు రోజూ సాయంత్రం వచ్చి నీకు పాఠాలు చెబుతారు" అంటే, తను కొద్ది సేపు మౌనంగా శిలావిగ్రహంలా ఉన్న మధును చూస్తే తనకు 'ఎమ్. ఎస్‌సి. చదివి ఎల్. డి. సి. ఉద్యోగమేమిటో?' అన్న భావన వచ్చింది. జవతాక్లాసేమో అన్న అనుమానమూ వచ్చింది!

కానీ, ఆయన పాఠం చెప్పే తీరు, ప్రజ్ఞ చూశాక, ఆయనతో పరిచయం కలిగాక, ఎమ్.ఎస్‌సి. యూనివర్సిటీ ఫస్ట్ అంటే నిజంగానే ఆశ్చర్యం కలిగింది.

"మాస్టారూ! మరి మీకు ఎల్. డి. సి. ఉద్యోగం తప్ప మరేం దొరకలేదా?"

"ఇదైనా దొరికింది!"

"అంటే!"

"లెక్చరరు ఉద్యోగాలకు రికమండేషన్లు కావాలి! నేను వాటిని సంపాదించలేను!"

"ఉద్యోగం చెయ్యందే గడవదా!"


"చెయ్యటం ధర్మం గదా! చదివిన చదువుకు సార్థకత ఉండద్దూ!"

నెలయ్యాక నాన్నగారు ట్యూషను ఫీజిస్తే పుచ్చుకోలా మధుమూర్తి! 'ఇచ్చిన పైకం చాలదేమో!' అనే తను భావించింది. కానీ మధుమూర్తి ఉద్దేశ్యం అదిగాదు!

"పద్మగారూ! నా చదువును డబ్బు రూపేణా మార్చుకోవాలని నా ఆశయం గాదు! అలా అయితే ట్యుటోరియల్ కాలేజీ పెట్టుకునేవాణ్ణి: నాకు తెలిసింది, చదువుకున్నది మీకు చెబుతున్నాను! అంతే!"

"ఇలా ఎవరికైనా చెబుతారా?"

"చెబుతాను! కానీ అపాత్రదానం




చిత్రం—సుధామ (హైదరాబాదు—36)

చెయ్యలేను. పెళ్లికోరకు పరీక్షలు పాసవటమే లక్ష్యంగా పెట్టుకునే వాళ్లకు చెప్పను! వాళ్లకు చెప్పగలవాళ్లు వేరే ఉన్నారు."

మధుమూర్తి చాలా విచిత్రమైన వ్యక్తి! పైకి అమాయకుడుగా కనిపించినా, ఆ మనిషి చాలా నిండైనవాడు. స్నేహశీలి. సంస్కారంతోపాటు చదువు, వినయశీలం ఉన్నవాడు!

పీటన్నిటినీ గమనించాక, తను మోసపోలేదు అనుకుంది. అందుకే హృదయం అర్పించిందికూడా!

'కానీ ఈ అవాంతరమేమిటి? పరీక్ష లయ్యాక మధును పెళ్లి చేసుకుందామని ఉంది అని చెప్పాలనుకుంటే, మధ్యలో కృష్ణమూర్తి ప్రవేశించాడేమిటి? ఈ అవాంతరాన్ని ఎలాగైనా తప్పుకోవాలి' అని నిశ్చయించుకుంది పద్మజ.

కారు రోడ్‌సైడ్ పార్క్‌చేసి, మేడ మీది గదివేపు చూసింది పద్మజ.

తలుపు తాళం వేసి ఉంది గది!

"మధు ఎక్కడకు వెళ్లాడు?"

వెళ్లి కింద ఇంటివాళ్లను వాకబు చేసింది.

"ఏంతు బాబు రాలేదమ్మా! మరొకాయన మధు వస్తే తాళంచెవి ఇవ్వమని చెప్పాడు" అన్నది ఇంటావిడ!

పద్మజ కేం చెయ్యాలో తోచలేదు.

"ఎలాగైనా ఈ రోజు ఈ వ్యవహారం పూర్తిచేసుకోవాలి!"

పద్మజ అక్కడే నిలబడి ఉండటం చూసిన ఇంటావిడ, "తాళంచెవి ఇమ్మంటారా?" అని అడిగింది.

"ఇవ్వండి!" తాళంచెవి తీసుకుని, మేడమీదికి వెళ్లి, తలుపు తీసుకు కూర్చుంది పద్మజ!

గదినిండా కాల్చి పారేసిన సిగరెట్ పీకలు, మ్యాన్‌పేపర్లు, విడిచేసిన గుడ్డలు, చాప మీద పరిచిన పరుపు ఉన్నాయి. గాలి ఆడక లోపల ముక్కవాసన వేయసాగింది!

కిటికీ తలుపులు తెరిచింది పద్మజ!

కుర్చీ లాక్కుని, టేబుల్ దగ్గిరగా కూర్చుంది!

టేబిల్ మీద ఉత్తరం . . . పైన యాష్‌ట్రే బరువుగా పెట్టి ఉంది.

పద్మజ కుతూహలంకొద్దీ ఉత్తరం తీసి చదివింది.

"డియర్ మధూ,

నే వెళ్లిపోతున్నాను అమరావతి. వచ్చిన పనైపోయింది! అర్ధాంతరంగా వచ్చి, తెలియకుండా నీ మనసుకు కష్టం కలిగించాను. క్షమించు!

మధ్యాహ్నం నువ్వు భగవంతంగా రింటికి వెళ్లాక, నిద్ర పట్టక మాగజైన్లేమన్నా ఉన్నాయేమోనని వెతికాను. ఏమీ దొరకలేదు. మనిద్దరికీ ఉన్న స్నేహం వల్ల, ఆత్మీయతవల్ల నీ పెట్టె తెరిచి చూశాను. అంతేగాదు, అందులో నీ డైరీకూడా తీసి చదివాను, నా దగ్గిర దాచే రహస్యాలేవీ నీ కుండవనే సదుద్దేశ్యంతోనే!

కానీ అలా డైరీ చదవటం మంచో చెడో నాకు తెలియదు. అందులోని విషయాలు చదివాక చేసింది తప్పు అయినా, మంచికూడా ఉందని తెలుసుకున్నాను.

పద్మ ఫోటో డైరీలో ఉంది! నీ పుట్టినరోజున పద్మ ప్రియాతిప్రియంగా ఇచ్చిన కానుక!

మధూ!

నా దగ్గిరకూడా రహస్యాలు దేనికి! నువ్వు, పద్మ ప్రేమించుకున్నారు. నాకు చెప్పలేదు. చెప్పేవాడివికూడా కాదు. ఈ డైరీ చూడకపోతే, నిన్ను నువ్వు వంచించుకుని, నా కిచ్చిన మాట కోసం ఇష్టంలేని పద్మను నాతో పెళ్లికి ఒప్పించే వాడివి! అవునా!

మధూ! మనం సోదరులలా బతికాం; పెరిగాం! పద్మను నువ్వు పెళ్లి చేసుకుంటే నే నెంతో ఆనంది స్తాను. మనిద్దరి మధ్యా ఇంతవరకు మనసా, వాచా అభిప్రాయభేదం లేదు! ఈ స్నేహం, అనురాగం ఇలా జీవనది లాగానే ఉండాలి! నీ అంతర్యం గ్రహించలేక, పద్మను పెళ్లి చేసుకుంటానని అన్నాను! క్షమించు.

నా కోసం నువ్వు త్యాగం చెయ్యకు. అది నేను భరించలేను. నువ్వు సుఖపడాలి! సంతోషంతో బతకాలి. ఇది నా ఆకాంక్ష! పద్మజ, నువ్వు పెళ్లి చేసుకు తీరాలి! ఇది నా వాంఛ! ఆజ్ఞకూడా! ఇది కనక తప్పావో మనం ఒకర్నొకరు పూర్తిగా మరిచిపోవాలి.

నా క్షమాపణలు పద్మజకు అందజెయ్యి!

మీ రిద్దరూ అన్యోన్యంగా, సుఖంగా తారాచంద్రుల్లా, రాగం, భావంలా కలిసి మెలిసి, మీ జీవితంలో కష్టం, బాధ ఎరగకుండా జీవించాలి. అందుకై సదా నేను మీకు అండగా ఉంటాను.

నువ్వు వచ్చేదాకా ఉండకుండా వెళుతున్నది కావాలనే! నువ్వు నన్ను అపార్థం చేసుకోకు.

క్షమించు. అమ్మకు, నాన్నకు నీ పెళ్లి సంగతి చెబుతాను. మళ్లీ ఉత్తరం వ్రాస్తాను. సెలవు.

—కృష్ణమూర్తి."

ఉత్తరం చదివి పద్మజ అనిముషురాలైంది.

కృష్ణ, మధు ల ప్రగాఢ స్నేహానికి ఆమె కన్నుల్లోంచి ఆనందబాష్పాలు రాలాయి!

మధు రాకకోసం ఎదురుచూస్తూ, అలాగే కూర్చుంది పద్మజ, ఎప్పటికైనా మధుమూర్తి వస్తాడన్న నమ్మకంతో! ★